


# సంధ్యా సమయంలో...

— విన్నకోట సుశీలాదేవి

శీతాకాలం ఉదయం!

అయిదు గంటల సమయం!

లోకమంతా మంచుదుప్పటి కప్పుకుని నిద్రపోతున్నట్లుగా వుంది. ఎక్కడో దూరం నుండి వినవస్తున్న వెంకటేశ్వర సుప్రభాతం వీనులకు మనోహరంగా వుంది. రంగనాధ రావు దుప్పటి ముసుగేసుకుని, మళ్లీ కళ్లు మూసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ నిద్ర పట్టలేదు. లేచి కూర్చున్నాడు. ఇల్లు నిశ్శబ్దంగా వుంది. గదంతా ఇంకా చీకటిగానే వుంది! ఏం చేయడానికీ పాలుపోలేదు! మళ్లీ రాత్రి వరకూ ఇదే వనవాసం అనుకుంటూ చిన్నగా నిట్టూర్చాడు.

రంగనాధరావుకు సుమారు అరవై అయిదేళ్లుంటాయి. ఆయనకు మనవడు రవీంద్ర తప్ప ఇంకెవ్వరూ లేరు. వున్న ఒక్కకొడుకూ - కోడలు పదేళ్లక్రితం కారు ప్రమాదంలో మరణించారు! రవీంద్ర, అతని భార్య శ్యామల ఇద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు! ఉదయం తొమ్మిదిగంటలకు బయటికెడితే తిరిగి వాళ్లింటి కొచ్చేసరికి రాత్రి ఏడుగంటలవుతుంది!

అప్పటివరకూ రంగనాధరావు - అంత పెద్ద ఇంటిలో ఒక్కడూ వుంటాడు! రంగనాధరావు రెవెన్యూ డిపార్ట్‌మెంటులో హెడ్‌క్లర్కుగా రిటైరయ్యాడు! ఉద్యోగ కాలంలో పని తప్ప రెండో విషయం పట్టించుకోలేదు! కొడుకూ - కోడలూ చనిపోయాక ఆ దిగులుతో రంగనాధ రావు భార్యకూడా మరణించింది! రిటైరయ్యాక ఆయన రెండేళ్లు విశ్రాంతిగా గడిపాడు. కానీ ఆ తర్వాత రోజు గడవడం ఒక యుగంగా మారింది!

ఇంతలో,

బయట "అమ్మా పాల ప్యాకెట్లు తీసుకోండి" అనే కేక విన్పించింది! కానీ శ్యామలకి ఆ కేక విన్పించిలేచిన సవ్వడే లేదు...

"అదృష్టవంతులు.. ఎంతగాఢంగా నిద్రపోతున్నారు" అనుకున్నాడు రంగనాధరావు.

తనకు ప్రతిరోజూ నాలిగింటికే మెలకువ వస్తుంది!

మళ్లా నిద్రపట్టదు! ఆ నిశ్శబ్ద వాతావరణంలో దుప్పటి కప్పుకుని కూర్చుంటే.. ఏవేవో ఆలోచనలు మనస్సుని ముసురుకుంటుంటాయి. గోరుముద్దలు తినిపించిన అమ్మ - సరదాగా గడిచిపోయిన బాల్యం... ఆ పల్లెటూళ్ళో, తమ ఇంటి వెనకే వున్న జామచెట్లు... కాలవఒడ్డు... చింతతోపులో ఆటలు... చదువు.. కాలేజీలోని ప్రేమ ముచ్చట్లు - వివాహం- వెన్నెల రాత్రులు ఆఫీసు వుద్యోగం...

ఒకటేమిటి జీవితంలోని ప్రతి చిన్న సంఘటనా గుర్తుకు వచ్చేది "అప్పుడే ఎంత జీవితం గడిచిపోయింది. ఇవన్నీ నిన్న- మొన్న జరిగినట్లున్నాయే..." అనుకునేవాడు.

"నాకొడుకు అందాలరాముడు" అని అమ్మమురిసి పోయేది!

"మీరు నల్లగా వున్నా ఎంత బాగుంటారో తెల్సా" అనేది లక్ష్మి"!

అవన్నీ జ్ఞాపకం వచ్చి విషాదంగా నవ్వుకున్నాడు!

ఆ అందమైన శరీరం ఇప్పుడెలా వుందో! ముడుతలు పడిపోయి ఎండిపోయినట్లుగా వుంది. నా శరీరం నాకే అస్సహ్యాం కలిగిస్తోంది

నేనిలా అవుతానని ఎప్పుడైనా అనుకున్నానా. శరీరం వడిలి పోయింది! తల వండిపోయింది! పండిపోయిన ఈ ఆకు ఎప్పుడో రాలిపోతుంది....

ఆ తర్వాత... ఏమవుతుంది?

ఆ ఆలోచనే భయం కలిగించగా.. ఒళ్ళంతా చల్లబడి నట్లయింది!

కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

ఈ పిచ్చి ఆలోచన్లనుండి మనసు మళ్లించుకోవాలని... మళ్లీ పడుకోవడానికుపక్రమిస్తుండగా-

"అమ్మా! అమ్మగారూ!" పనిమనిషి గొంతు విన్పించింది.

శ్యామలకి మెలకువ వచ్చింది!

"వస్తున్నా" లేచింది!

'అయితే తెల్లవారిందన్నమాట, అనుకుంటూ శాలువా కప్పుకుని దొడ్లోకి వచ్చాడు!

ఇంకా పూర్తిగా వెలుతురురాలేదు! సూర్యకిరణాలు మంచుతెరలతో యుద్ధం చేస్తున్నాయి! పనిమనిషి పంపులో నీళ్లు పడుతోంది. రంగనాధరావు వచ్చి దొడ్డిగుమ్మం మెట్లమీద కూర్చున్నాడు. పనిమనిషికి గిన్నెలు వేస్తూ-

"తాతయ్యగారూ! అప్పుడే లేచారే! కాస్సేపు పడుకోలేకపోయారా!" అనడిగింది శ్యామల!

"నిద్రపట్టలేదమ్మా!" అన్నాడాయన!

శ్యామల లోపలికెళ్లిపోయింది!

ఒక్కనిముషం తీరుబడిగా నిలబడి మాట్లాడే అవకాశమే లేదు. లేచిన దగ్గర్నించీ ఒకటే పరుగు...

శ్యామల ముఖం కడుక్కుని రంగనాధరావుకి అన్నీ అమర్చింది! అమె కాఫీపెట్టి టిఫిను చేసే లోపల రవీంద్ర లేచాడు! రంగనాధరావు కాఫీత్రాగి వరండాలో కూర్చుని ఎదురుగా గోడమీద పడే ఎండని చూస్తున్నాడు.

రవీంద్ర ముఖం కడుక్కుని వచ్చాడు!

టేబిల్‌ముందు కుర్చీలో కూర్చుంటూ-

"తాతయ్య కాఫీ త్రాగాడా?" అనడిగాడు.

"ఆ" అంది శ్యామల.

"స్నానం చేశాడా?"

"ఇంకాలేదు"

రవీంద్రకి కాఫీ ఇచ్చింది.

"శ్యామలా! తాతయ్య ఈమధ్య చాలా మారిపోయాడు గమనించావా?" కాఫీ తాగుతూ అడిగాడు!

శ్యామల కూర తరుగుతోంది!

"మారిపోయారా! అంటే!"

"ఇదివరకు మనం వున్నంతసేపైనా మనతో కబుర్లు చెప్పేవాడు! ఈ మధ్య ఒంటరిగా.. దిగులుగా వుంటున్నాడు!"

"ఏమోనండీ! నేను గమనించనేలేదు!" అంటూ తరిగిన కూర తీసుకుని స్టవ్ దగ్గరికి వెళ్లింది!

రవీంద్ర అక్కడినుండి లేచి బాత్‌రూమ్‌లోకెళ్లి స్నానం చేసి వచ్చాడు. షర్టుకి గుండీలు పెట్టుకుంటూ వీధిలోకి వచ్చాడు! రంగనాధరావు వరండాలో ఇంకా అలానే కూర్చొన్నాడు!

రవీంద్ర ఆయన దగ్గరికొచ్చి-

"తాతయ్యా అలా కూర్చున్నావేం?" అనడిగాడు.

రంగనాధరావు వులిక్కిపడి చూశాడు.

"అబ్బే ఏంలేదురా" అంటూ నవ్వేశాడు!

ఆ నవ్వు ఎప్పటిలా లేదు! ఏదో బాధ - విచారం దాచుకున్నట్లుగా వుంది!

"తాతయ్యా! నీకు ఒంట్లోబాగా వుండటంలేదా?"

రవీంద్ర ఆయన్ని పరిశీలనగా చూశాడు! రంగనాధరావు కళ్ల క్రింద నల్లచారలు కన్పించాయి. ముఖమంతా పీక్కుపోయినట్లుగా వుంది!

మనవడి మాటలకు నవ్వేస్తూ-

"నాకేం రా! చేసేపనేంలేక - ముప్పొద్దులా తింటూ హాయిగా వుంటున్నాను" అన్నాడాయన

ఆ మాటలోనే అనంతమైన నిరాశ ధ్వనించింది రవీంద్రకు.

"తాతయ్యా! పైకలా అంటున్నావు కానీ నువ్వెందుకో చాలా దిగులుగా వున్నట్లు కన్పిస్తున్నావ్"

"ఇంకా నయంలే! నాకేం దిగులు అయినా పొద్దున్నే నీకిపిచ్చి మాటలేమిటి? ఇవ్వాళ ఆఫీసు లేదా ఏమిటి?" అన్నాడు

"వుంది.. వెడుతున్నాను!" అంటూ రవీంద్ర.. లోపలికి వచ్చేశాడు!

అప్పుడే ఎనిమిదయింది!

తనగదిలోకొచ్చి ఆఫీసు కాగితాలు చూసుకుంటూ కూర్చున్నాడు.

శ్యామల తొమ్మిదిగంటలకు భోజనానికి పిల్చింది.

ఇద్దరూ భోజనాలు చేసి టిఫిన్ బాక్సుల్లో పెట్టుకుని బయటికి వచ్చారు. తొమ్మిదిన్నరయింది. వెంటనే బయలుదేరితేగానీ, శ్యామలని వాళ్ల ఆఫీసులో దింపేసి.. వదిలోపు తను ఆఫీసుకు చేరుకోలేడు! స్కూటరు బయటికి తీసి స్టార్టు చేయబోయాడు

"వుండండి, తాతగారితో చెప్పివస్తాను" అంటూ శ్యామల రంగనాధరావు దగ్గరికొచ్చింది.

"తాతయ్యగారూ! మేము వెడుతున్నాం అన్నీ టేబిల్‌మీద సర్దేశాను. వేళకి భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి" అంది.

రంగనాధరావు అలాగే నంటూ తలూపాడు!

శ్యామల వెనకాలే వచ్చి... వీధి తలుపేయబోతూ మనవడి వైపు చూశాడు ఆ చూపు రవీంద్రలో ముల్లులా గుచ్చుకుంది!

ఆఫీసులో కూర్చున్నా రంగనాధరావు చూసిన చూపే రవీంద్రకు జ్ఞాపకం రాసాగింది. అడవిలో తప్పిపోయిన ఒంటరి లేడిపిల్లలా... తల్లీతండ్రీ వదిలేసిన చిన్నపిల్లాడిలా.. ఆ చూపుమాటిమాటికీ హృదయంలో గుచ్చుకుంటోంది. బలవంతంగా మనసు మరల్చుకుని పనిలో తలదూర్చాడు రవీంద్ర.

మర్నాడు ఆదివారం.

రంగనాధరావు మామూలు సమయానికే లేచాడు. ఆదివారం వస్తే శ్యామల ఏడుగంటలకు లేస్తుంది. అప్పటివరకూ ఒంటరిగా ఆయన నరకబాధని అనుభవిస్తాడు. ఆదివారం శ్యామలకి ఆనందం కలిగించినా రంగనాధరావుకు మాత్రం.. ఆదివారమంటే భయం.

వుద్యోగం నుండి రిటైరయిన క్రొత్తలో మార్నింగ్ వాక్‌కి వెళ్లేవాడు. కానీ ఇప్పుడు ఎక్కడికీ వెళ్లాలనిన్పించడం లేదు. అదీకాక ఆయనకు చెప్పుకోదగ్గ స్నేహితులు కూడా లేరు. అందుకే శ్యామల గానీ రవీంద్రగానీ కాస్సేపు తన దగ్గర కూర్చుని మాట్లాడితే బాగుండుననుకుంటాడు. కానీ వాళ్లకు తీరుబడేదీ?

భగవంతుడా ఒంటరితనానికి మించిన శిక్షలేదు. ఇంట్లో ఒకళ్లిద్దరు చిన్నపిల్లలున్నా తనకి తోడుగా వుండేది. కానీ శ్యామల రవీంద్ర అయిదేళ్లవరకూ పిల్లలు పుట్టకూడదనే అభిప్రాయంలో వున్నారు.

ఏడుదాటుతుండగా శ్యామల లేచింది. కాఫీటిఫిను తయారు చేసింది. ఆరోజు రవీంద్ర కొంచెం తొందరగానే లేచాడు.

సరాసరి రంగనాధరావు గదిలోకొచ్చాడు.

రంగనాధరావు దుప్పటి ముసుగేసుకుని పడుకునే వున్నాడు.

"తాతయ్యా" అని మెల్లగా పిలిచాడు.

దుప్పటి ముసుగు తీశాడు. కానీ రంగనాధరావు కళ్లల్లోని తడి అతని దృష్టిని దాటిపోలేదు. రవీంద్ర మనస్సు చివుక్కుమంది.

"తాతయ్యా! ఇంకా పడుకున్నావేంలే... ముఖం కడుక్కుందువుగానీ" రవీంద్ర ఆయన చెయ్యి పట్టుకుని లేవదీశాడు.

ఆయన్ని నడిపిస్తూ - "తాతయ్యా! ఎంత చిక్కిపోయావో తెలుసా" అన్నాడు.

"నీమొహం.. ఏంలేదు.."

టిఫిను తింటోంటే.. రవీంద్ర అన్నాడు...

"తాతయ్యా! ఇది విన్నావా! మాటైపిస్టు సుబ్బారావు తను టైపు చేసిన కాగితాల్తో పాటు వాళ్లావిడ బజారు నుండి తీసుకురమ్మన్న వెచ్చాలలిస్టు కూడా కలిపేశాడు. మా మేనేజరు దానిమీద కూడా సంతకం పెట్టేశాడు. ఇక నిన్న అవి జి.యమ్ దగ్గరికెళ్లాయి. అవి చూసి.. ఆయనెలా గెంతాడంటే..." నవ్వసాగాడు.

రంగనాధరావుకు కూడా నవ్వొచ్చింది. పెద్దగా నవ్వాడు!

ఆయన అంతగా నవ్వడం ఎప్పుడూ చూడని శ్యామల ఆయనవేపు వింతగా చూసింది.

రవీంద్ర ఇంకాస్సేపు ఆఫీసు విషయాలు చెప్పి.. లేచాడు రంగనాధరావుకి ఒక్కసారి చీకటి వ్యాపించి నట్లయింది. రవీంద్ర ఇంకాస్సేపు అలా కబుర్లు చెప్తే బాగుండుననిపించింది.

శ్యామల వంటపనిలో పడింది.

రంగనాధరావు అక్కడినుండి కదిలి తన గదిలోకెళ్లాడు. ఏంచెయాలో తోచలేదు. మంచం మీద వాలి దుప్పటి ముసుగేసుకుని పడుకున్నాడు!

రవీంద్ర కొలీగ్స్ వస్తే బయటికి వెళ్లాడు.

శ్యామల పదకొండు గంటల ప్రాంతంలో రంగనాధరావుని భోజనానికి పిలిచింది. రంగనాధరావు వెళ్లి భోజనం చేసి వచ్చాడు.

రవీంద్ర ఒంటిగంటదాటాక వచ్చాడు.

వస్తూనే శ్యామలని అడిగాడు.

"శ్యామలా! తాతయ్య భోజనం చేశాడా?"

"ఆ" అంది.

రవీంద్ర తాతగారి గదిలో కొచ్చాడు. ఆయన మంచంమీద కూర్చుంటూ

'తాతయ్యా' అనిపిలిచాడు.

ఆయన కళ్లు విప్పి చూశాడు.

"తాతయ్యా ఎప్పుడూ అలా పడుకుని వుంటావెందుకు?"

"మరేం చెయ్యమురా?"

ఆమాట సూటిగా తాకింది. ఏం చెప్పాలో వెంటనే స్ఫురించలేదు. క్షణం ఆగి అన్నాడు.

"ఏదైనా పుస్తకం చదువుకోకూడదూ"

"ఏం చదవాలని లేదురా".

రవీంద్ర ఇంకేం మాట్లాడలేకపోయాడు.

ఆయన ఎదుట కూర్చుని ఆయన బాధని చూడటం కూడా రవీంద్రకు దుర్భరంగా తోచింది.

లేచి వచ్చేశాడు.

* * *

ఆ సాయంత్రం రవీంద్ర స్నేహితుడు రామకృష్ణ వచ్చాడు.

"ఏమిటోయ్! రెండుగంటలకు వస్తానన్నావ్. రాలేదే. ఇక చూసిచూసి నేనే వచ్చేశాను" అన్నాడు రవీంద్రతో.

రామకృష్ణని తన గదిలోకి తీసుకెళ్లాడు రవీంద్ర.

"ఏంచేశావురా! నిద్రపోయావా?" రామకృష్ణ మళ్లీ అడిగాడు.

"అబ్బే నిద్రకాదురా! మా తాతయ్యకి పుస్తకం చదివి వినిపిస్తున్నాను" అన్నాడు రవీంద్ర

రామకృష్ణ నవ్వాడు.

"తాతగారికి సేవా?"

"అదికాదురా! తాతయ్య ఈమధ్య అదోలా వుంటున్నాడు. కారణం తెలీకుండా వుంది" రవీంద్ర దిగులుగా అన్నాడు.

"ఎందుకేమిట్రా! ఈ వయసులో మనుమలకొచ్చే జబ్బు ఇది. మీ తాతయ్య ఎందుకలా వున్నాడో తెలుసా. ఈ వయసులో ఆయనకు మనిషి తోడు చాలా అవసరం. అది లేకనే మీ తాతయ్య అలా వున్నాడు" అన్నాడు.

రామకృష్ణ మాటల్తో రవీంద్రకు సమస్య మంచు విడిపోయినట్లు విడిపోయినట్లయింది.

"రవీ దీనికో వుపాయం చెప్పనా!"

"ఏమిటది?"

"ఈ వూళ్లో ఓల్డేజ్ హోమ్ వుంది. మీ తాతయ్యని దాన్లో చేర్చు. నేను మా అమ్మను కూడా దాన్లో చేర్చాలనుకుంటున్నాను" అన్నాడు రామకృష్ణ.

రవీంద్ర ఆశ్చర్యపోయాడు.

"అవున్రా మా ఆవిడకీ, అమ్మకీ ఒక్కక్షణం పడటంలేదు. మా ఆవిడ నిన్ననే గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. మా అమ్మ వుంటే ఇంట్లో వుండనని.. ఇక ఏం చెయ్యను? ఆవిడ్ని ఆ హోమ్‌లో చేర్చే ఏర్పాట్లు చేస్తున్నా!" అన్నాడు రామకృష్ణ.

ఆమాట వినగానే రవీంద్రకు చాలా బాధకలిగింది. "ఒరేయ్, ఆవిడ ఈ వయసులో అక్కడెలా వుండగలదు, అయినా ఇప్పుడు నువ్వేగా" అన్నావు. ముసలి వయసులో మనిషి అవసరం చాలా వుంటుందని.. మరి నువ్వే చివరికిలా...."

"ఏం చెయ్యమంటావురా! ఇంట్లో గొడవ ఎక్కువగా వుంది. నాదగ్గరే ఆవిడ్ని వుంచుకోవాలని వుంది. కానీ పరిస్థితులు సహకరించడంలేదు..." నిర్లిప్తంగా అన్నాడు.

రవీంద్ర స్నేహితుని, ముఖంలోని బాధని చూసి



## సాయంత్రమే నయం!

ఆరోగ్యానికి వ్యాయామం అవసరం. అన్నిటికన్నా సులభమైన వ్యాయామం 'జాగింగ్'. అయితే 'జాగింగ్'కి ఉదయం మంచిదా, సాయంత్రం మంచిదా? జపాన్‌లో ఈ విషయంలో వైద్యనిపుణులు జరిపిన విస్తృత పరిశోధనలలో సాయంత్రం 'జాగింగ్' వలన దేహారోగ్యంలో మంచి మార్పులు వస్తాయని రుజువయింది. సాయంత్రం 5 గంటల నుంచి 5 1/2 గంటల మధ్యకాలం జాగింగ్‌కి 'బెస్ట్‌టైమ్' అని పేర్కొన్నారు.

అవిషయాన్ని గూర్చి ఎక్కువ తర్కించలేదు. ఇతర విషయాల వేపు సంభాషణ మరల్చాడు.

అయిదు గంటల ప్రాంతంలో రామకృష్ణ వెళ్లాడు. స్నేహితుని పంపి లోపలికొచ్చిన రవీంద్రని చూసి-

"సినిమాకు వెడదామా?" అనడిగింది శ్యామల. తాతగారిని ఒంటరిగా వదిలి సినిమాకు వెళ్లాలని లేదతనికి! కానీ శ్యామల కోరికని కాదని వారానికి ఒక్కరోజు ఆమె ఆనందాన్ని భగ్నంచేయలేదు. క్షణం ఆలోచించాడు.

ఆశగా తన ముఖంలోకి చూస్తున్న శ్యామలని గమనించి

"అలాగే వెడదాం" అన్నాడు.

శ్యామల వుత్సాహంగా లోపలకు వెళ్లింది.

రవీంద్ర తాతగారి దగ్గరకొచ్చి "తాతయ్యా! సినిమాకు వస్తారా" అనడిగాడు.

"నాకు సినిమా లేమిట్రా! మీ రిద్దరూ వెళ్లండి" అన్నాడు. ఆయన రాడని తెలిసీ మొక్కుబడిగా అడిగినట్లుంది.

ఆరాత్రి సినిమా నుండి వచ్చాక శ్యామలతో అన్నాడు.

"శ్యామలా తాతయ్య ఈ పూట భోజనం చేయలేదు చూశావా?"

"అవునండీ బహుశ ఆకలి లేదేమో?"

"అదేం కాదు! తాతయ్య బాధకిగల కారణం చెప్పనా"?

"చెప్పండి"

"ఆయన ఒంటరితనంతో బాధపడుతున్నాడు".

దుప్పటి దులుపుతున్న శ్యామల ఆగిపోయింది.

"ఒంటరితనమా; మనం వున్నాంకదా, అంది ఆశ్చ ర్యంగా

రవీంద్ర నవ్వాడు.

"మనం.. పేరుకు మాత్రమే వున్నాం. ప్రొద్దున తొమ్మిదింటికి వెడితే తిరిగి రాత్రి ఎనిమిది గంటల కొస్తాం. ఈ మధ్యకాలంలో ఆయనకు తోడెవరున్నారు?"

"అవును నుమండీ" అంది సాలోచనగా

"తాతయ్య కొన్నాళ్లిలా ఒంటరిగా వుంటే ఏమవుతాడో నని భయంగా వుంది" అన్నాడు దిగులుగా.

క్షణం ఆగి అంది.. "పోనీ నేను వుద్యోగం మానెయ్యనా?

"అదికాదు సమస్యకు పరిష్కారం!"

"మరేంచేద్దాం"

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు మంచంమీద పడుకుంటూ.

ప్రొద్దుటినుండీ పనిచేసి అలిసిపోయిన శ్యామల పక్క మీద పడుకోగానే నిద్రపోయింది. కానీ రవీంద్రకు త్వరగా నిద్రరాలేదు. 'తాతయ్య సమస్యని ఎలా పరిష్కరించాలా" అని ఆలోచిస్తూ చాలా రాత్రి వరకూ మేలుకునే వున్నాడు.

* * *

రెండ్రోజులు గడిచాయి.

మూడోనాటి సాయంత్రం రామకృష్ణ వచ్చాడు.

"రవీ! నువ్వెప్పుడు మా ఇంటికి రావాలిరా "

"ఎందుకు? "

మా అమ్మని, హోమ్‌లో చేర్పిస్తానని చెప్పాగదా ఇవ్వాళ తీసుకురమ్మని వుత్తరం వచ్చింది. నువ్వు కూడా కాస్త తోడుంటే బాగుంటుంది" అన్నాడు.

'సరే పద.." బట్టలు మార్చుకున్నాడు

ఇద్దరూ స్కూటరు మీద బయలుదేరారు.

"తాతయ్యని కూడా చేర్పిస్తే...' అనే ఆలోచన వచ్చింది రవీంద్రకు... ఇప్పుడెలాగూ వెడుతున్నాడు కాబట్టీ దాని మంచిచెడ్డలు విచారించి.. తర్వాత ఒకనిర్ణయానికి రావచ్చు" అనుకున్నాడు.

రామకృష్ణ ఇంటికెళ్లారిద్దరూ.

"నువ్విలా కూర్చోరా" రవీంద్రకు కుర్చీ చూపి తను లోపలికెళ్లాడు.

"అమ్మా! రెడీ అయ్యావా! లోపల్నించి రామకృష్ణ గొంతు విన్పిస్తోంది.

"ఎక్కడికిరా"


"మళ్లా మొదటికి వచ్చావా? డాక్టరు దగ్గరికే" చిరాగ్గా అన్నాడు.

"ఇప్పుడు నాకు డాక్టరెందుకురా కొద్ది కాళ్లనొప్పులు అంతేగా... అదే తగ్గిపోతుంది."

రామకృష్ణ ఎలా అబద్ధమాడుతున్నాడో? పాపం ఆవిడ కొడుక్కి తన మీద ఎంతో ప్రేమ వుందని మురిసిపోతోంది.

"త్వరగా రమ్మా" మళ్లీ హెచ్చరించాడు.

ఇక ఆతర్వాత ఏ మాటలూ విన్పించలేదు. పదిని ముషాల తర్వాత రామకృష్ణ-అతనితల్లి బయటికొచ్చారు. రవీంద్రని చూసి -



## కొత్తవైద్యం

అమెరికా హాస్పటల్స్‌లో కొత్తరకం వైద్యంతో రోగులకి చికిత్స చేస్తున్నారు. ఈ చికిత్సకి వాడే మందు ఎవరూ తయారు చేయరు. ఎక్కడా దొరకవు.

హాస్పిటల్‌కి అనుబంధంగా వున్న "నవ్వుల గది"లోకి రోగులని తీసుకువెళ్ళి డాక్టర్లు, నర్సులు మంచిమంచి జోకులు చెప్తారు. మినీ హాస్యకథలు రోగి మూడ్‌ని చూసి చెప్తారు. "నవ్వించే నర్సులు" అని హాస్పిటల్స్‌లో ప్రత్యేక బృందాలని తయారు చేసి రోగుల విషయం పట్టించుకోమంటున్నారు.

అయితే నవ్వుకూడా మోతాదు మించి రాకూడదు. అందుకే 'మితిమీరి నవ్వితే ఆరోగ్యానికి హానికరం' అని డాక్టర్లు రోగుల విషయంలో జాగ్రత్త పడుతున్నారు.

"బాగున్నావా నాయనా"అంటూ పలకరించింది.

"ఆ"

రవీంద్ర - రామకృష్ణ స్కూటర్‌పైనా ఆవిడి రిక్షాలోనూ బయలుదేరారు.

అరగంట తర్వాత ఓల్డేజ్‌హోమ్ చేరుకున్నారు.

ఊరికి దూరంగా వుంది. విశాలమైన ఆవరణలో మధ్య తెల్లని డాబా వుంది.

"దిగమ్మా"

ఆవిడ చుట్టు పక్కల చూస్తూ-

"ఇదేమిట్రా! డాక్టరిల్లు వూరికి ఇంత దూరంగా వుందే"?

"వాతావరణం బాగా వుందని ఇక్కడ కట్టుకున్నాడు లే.. రా!"

అని తల్లిని చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకొచ్చాడు రామకృష్ణ.

ముందుగదిలో ఆఫీసువుంది.

రామకృష్ణ.. కుర్చీలో కూర్చున్న వ్యక్తిని చూసి నమస్కారం చేస్తూ ఈవిడేనండీ" అన్నాడు.

ఆ వ్యక్తి ఆవిడని పరిశీలించి రామకృష్ణ చేత ఏవేవో సంతకాలు చేయించుకున్నాడు.

"ఆవిడ్ని ఈపూటే చేర్చుకుంటాం" అన్నాడు.

బెల్ కొట్టి ప్యూన్ని పిలిచాడు.

"అతనితో వెళ్లండి"

ముగ్గురూ లోపలకు వెళ్లారు.

మధ్య ఒక పెద్దహాలు, హాలు చుట్టూ గదులు. హాల్లోనూ గదుల్లోనూ చాలామంది కన్పించారు. ప్యూను వాళ్లని ఒక గదిలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఒక డెభైఏళ్ల వృద్ధురాలు వుంది. ఎదురుగా పళ్లెంలోంచి ఏవో తీసుకుని తినాలని ప్రయత్నిస్తోంది. కాని చేతులు వణుకుతూ తినలేకపోతోంది. ఆ దృశ్యం రవీంద్ర మనసుని కలచివేసింది.

ముందుకు వెళ్లి చూశాడు.

పళ్లెంలో అటుకులు వున్నాయి.

రవీంద్ర అవితీసుకుని ఆమె చేతుల్లో వేశాడు. ఆవిడ తలెత్తి, రవీంద్ర వేపు అభిమానంగా చూసింది.

"ఇదేమిట్రా ఇక్కడకు తీసుకొచ్చావ్".

రామకృష్ణ తల్లి భయం భయంగా అడుగుతోంది.

"డాక్టరుగారు నిన్ను పరీక్ష చేస్తారుట. రెండ్రోజులు ఇక్కడ వుంచమన్నారు" అన్నాడు.

"ఇక్కడా వూహు వద్దురా. అయినా నాకేరోగమూ లేదు... పద ఇంటికి పోదాం" ఆ వాతావరణం చూసి ఆమె చాలా గాబరాపడిపోతోంది.

"అదికాదమ్మా డాక్టరుగారు నిన్ను పరీక్ష చేయ్యాలన్నారు. లేకపోతే ఆయనకు కోపం వస్తుంది. అదీ కాక నీకీళ్ల జబ్బు తగ్గొద్దా."

"నాకేం జబ్బు లేదన్నానా".

ఆవిడకి సమాధానం చెప్పలేక రామకృష్ణకి విసుగొచ్చింది.

"అమ్మా! ఇప్పుడలాగే వుంటుంది. నీ వ్యాధి విషయంలో అశ్రద్ధ చెయ్యకూడదు. ఆ తర్వాత ముదిరి పోతే వేలకివేలు ఖర్చవుతే ఎవరు భరించగలరు?" తీవ్రంగా అన్నాడు.

రామకృష్ణ చెప్పే అబద్ధాలు వినలేకపోయాడు రవీంద్ర. 'ఆ అమాయకురాలిని ఎలా మోసం చేస్తున్నాడు?' అనుకున్నాడు.

రామకృష్ణ ఆమె సామానులు ఆయాకి అప్పచెప్పాడు.

'కాస్త జాగ్రత్తగా చూస్తుండండి నేను అప్పుడప్పుడు వస్తుంటాలెండి.' రహస్యంగా చెప్పాడు.

"ఇక మేం వెడతాము.." తల్లికి చెప్పి వెనుదిరగ బోయాడు వున్నట్లుండి ఆమె భోరుమంది. రామకృష్ణ ప్రవర్తనలో ఆమెకేదో అనుమానం తోచడంతో ఆమెలో మొండితనం పోయి బేలతనం ఆవరించింది.

"ఒరేయ్ రామూ నేనిక్కడ వుండలేనురా. మనింటికి తీసుకెళ్లు" నిన్ను రోజూ చూడకుండా నేనెలా వుండగలను! నా మనవడు గోపి వాడి ముద్దుమాటలు వినకుండా ఎలారా! నువ్వు నారోగానికి ఒక్క పైసాకూడా ఖర్చుపెట్టక్కర్లేదు. నన్ను ఇంట్లో వుండనివ్వు చాలు. రోజుకి ఒక్కపూట అన్నం పెట్టు చాలు... నేనెలా చచ్చినా ఫర్వాలేదు.. నన్నునీదగ్గర వుండనివ్వు చాలురా..." ఆమె రామకృష్ణ వెంటబడి బ్రతిమాలుతోంది.

ఆ దృశ్యం చూస్తోంటే రవీంద్ర హృదయంలో చెయ్యి పెట్టి కలచివేసినట్లయింది. ఇక అక్కడ వుండలేక బయటకొచ్చాడు.

ఆ ఇంటి ముందున్న గార్డెన్‌లో తిరుగుతూంటే రవీంద్ర దగ్గరకు ఒక వృద్ధుడు వచ్చాడు.

"ఎవరు బాబూ నువ్వు" అన్నాడు పలకరింపుగా

"నేను.. నేను"

రవీంద్ర తడబాటుని గమనించి - "అయితే నువ్వు మీ వాళ్లనెవర్నో ఇక్కడకు చేర్పడానికి వచ్చావన్నమాట".

"ఆ.... ఆ.."
ఆయన ముఖం జేవురించింది కోపంతో-

"ఏమిటి నిన్ను పెంచి పెద్దచేసిన నీ తల్లిదండ్రులు నీకు బరువయ్యారా. వాళ్లతో అవసరం తీరిపోయింది కదా అందుకని వాళ్లనిక్కడ పారేసి మీరు హాయిగా వుంటారా?"
రవీంద్రకు ఏం చెప్పాలో తోచలేదు.

"బాబూ! నాకు ఆరుగురు కొడుకులు వాళ్లను ఎంతో గారాబంగా పెంచాను. వాళ్ల కోరికలు తీర్చ డానికి ఓవర్ వర్కుకూడా చేసేవాడిని. వాళ్లని వృద్ధిలోకి తీసుకొచ్చాను. కానీ ఇంత చేసిన దానికి వాళ్లు నాకేం చేశారో తెలుసా. నేను ముసలాడిని.. నామాటలు చాదస్తంగా వుంటాయట. వాళ్ల సరదాలకు, పార్టీలకు నేను అడ్డుగా వున్నానట... నాలాంటి ముసలాడిని తండ్రిగా చెప్పుకోవడం సిగ్గుట.. అందుకని నన్నిక్కడ పారేశారు. బాబూ ఇదొక ప్రత్యక్ష నరకం... ఇంతకన్నా చావుమేలు. ఆ మృత్యుదేవత నన్నెప్పుడు కరుణిస్తుందాని ఆశగా చూస్తున్నాను" ఆయన గొంతు గద్గదమైంది.

రవీంద్ర ఏదో జవాబు చెప్పబోయాడు కానీ ఇంతలో రామకృష్ణ లోపలినుండి.. హడావుడిగా వచ్చి "రవీ త్వరగా పోవాలి. ఇక్కడినుండి.. రా" అంటూ అతని చెయ్యిపట్టుకుని బయటకు లాక్కువెళ్లాడు.. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ-

"రవీ! త్వరగా స్కూటరు స్టార్టు చెయ్యి ఇంకాస్సేపు ఇక్కడున్నామంటే మా అమ్మ నావెంటపడి వచ్చేస్తుంది" అన్నాడు కంగారుగా.
ఆమాటతో రవీంద్రకు కోపం - బాధ కలిగాయి.

"ఒరేయ్! నువ్వసలు ఆవిడ కన్నకొడుకువేనా?" అనడిగాడు తీవ్రంగా.
"ఏమిట్రా ఒక్కసారిగా అంత అనుమానం వచ్చింది" అన్నాడు వెనకాల కూర్చుంటూ.

"లేకపోతే ఏమిట్రా ఆవిడంతగా ఏడుస్తూంటే.. అంత కఠింగా ఎలా వదిలి రాగలిగావ్. నువ్వసలు మనిషివేనా"
"అదికాదురా..."

"ఒరేయ్ నువ్వు ఎన్ని చెప్పినా నేను వినను.... అయినా నీ భార్యకి ఆమాత్రం నచ్చచెప్పుకోలేవా?"

"నీకు తెలియదురా నాబాధ. నువ్వొక్కరోజు మా ఇంట్లో వుంటే తెలుస్తుంది. ఆవిడ్ని ఇక్కడ వదిలేయడం నాకుమాత్రం ఇష్టమా. నా హృదయం ఎంత ఏడుస్తోందో ఆదేవుడికే తెలియాలి. కానీ నేను అసమర్థుడినిరా రవీ! ప్లీజ్ ఇక ఆ విషయం వదిలెయ్.." భారంగా అన్నాడు.

రవీంద్ర ఆమాటతో, సమాధాన పడలేకపోయాడు. కానీ రామకృష్ణని ఇంకేం అడగలేదు. స్కూటరు స్టార్టు చేశాడు.

* * *

ఆరాత్రి శ్యామలతో జరిగింది చెప్పాడు.
"శ్యామలా! ఆమెకి రామకృష్ణ ఒక్కడే కొడుకు. చిన్నప్పుడే భర్త చనిపోతే.. వాడిని ఎంత గారాబంగా పెంచిందో చెప్పలేను. అటువంటి అమ్మని నెత్తిమీద పెట్టుకుని పూజించాలి. వీడు క్షణం క్షణం చావమని ఆ యమకూపంలో వదిలేశాడు. శ్యామలా! రామకృష్ణని వదల్లేక ఆమె పడిన బాధని చూడలేకపోయాను...." కళ్లల్లో నీళ్లు తిరిగాయి రవీంద్రకు.

"ఆటవిక జాతుల్లో..... ఒకచోటనుండి ఇంకోచోటికి వెళ్లేడప్పుడు ముసలివాళ్లు తమకు బరువని వాళ్లని అడవిలో వదిలేసేవారుట.. ఆ తర్వాత వాళ్లనేవో క్రూరజంతువులు చంపేవిట..పుస్తకాల్లో ఆ విషయం చదివి వాళ్లెంత కిరాతకులో అనుకున్నాను. ఇప్పుడు రామకృష్ణని చూస్తోంటే ఇతనికంటే వాళ్లేనయమనిపించింది. రామకృష్ణలాటివాళ్లు తమ తల్లిదండ్రులను శారీరకంగానే కాక - మానసికంగా కూడా చంపుతున్నారు. ఏదైనా శ్యామలా! తాతయ్యని మాత్రం అక్కడ చేర్చను.

"అదేవిటీ! అయినా మీకా ఆలోచన ఎలా వచ్చింది?"
శ్యామల ఆశ్చర్యంగా అడిగింది. 'మనింట్లో ఒంటరితనంతో బాధపడుతున్నాడు కదా పోనీ అక్కడైతే నలుగురూ వుంటారుగా సందడిగా వుంటుదనుకున్నాను.... కానీ అక్కడి వృద్ధుల్లో సంతోషం ఏమాత్రం కనబడటంలేదు. అందరిలో భయం... బాధ... ఆవాతావరణంలో నేనే వుండలేకపోయాను."

"సరేలెండి... దాన్నిగూర్చే ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకండి.... ఇక నిద్రపోండి." శ్యామల ఉచిత సలహా ఇచ్చి తను కళ్లు మూసుకుంది.
కానీ రవీంద్రకు నిద్రపట్టలేదు.

* * *



## మధుమాసం

వసంతకోకిల తీయనిరాగం,
హృదంతరంలో సుమధురభావం,
మలయానిలమున మోహనగీతం,
ఎంతటి రమ్యం ఈ మధుమాసం.

చిగురాకులలో దాగి ఉన్నది,
రాగాలు పలికే గారాల కోయిల,
సుందర స్వప్నాల శుభ సందేశం,
మధురానందం ఈ మధుమాసం.

చల్లని తెల్లని జాబిలి కిరణం,
మల్లెల సుమాల మంచి పరిమళం,
ప్రకృతి కాంత మది పొంగిన తరుణం
మమతల కోవెల ఈ మధుమాసం.

నవరస భరితం నవ్యవసంతం,
భావకవుల కిది భావతరంగం,
ఎంతటి రమ్యం ఈ మధుమాసం.

-'మంకణ'

వారంరోజులు గడిచాయి.
ఒకరోజు రాత్రి ఏదో మాగజైన్ తిరగేస్తూ హఠాత్తుగా అరిచాడు.
"శ్యామలా దొరికింది."
శ్యామల మంచం మీద పడుకుని రేడియోలో పాటలు వింటోంది. రవీంద్ర అరుపుకు వులిక్కిపడి రేడియో కట్టేసి-
"ఏమైందండీ" అనడిగింది. కంగారుగా
"శ్యామలా! తాతయ్య సమస్యకి పరిష్కారం దొరికింది."
"ఏమిటది?"
"ఒక్క క్షణం వుండు..."
కాగితం పెన్నూ తీసుకుని ఏదో చకచకా రాసేశాడు.
"శ్యామలా..... ఇది విను.." చదవసాగాడు.
"కావలెను. అరవైఏళ్ల వ్యక్తి తోడుగా వుండటానికి ఒక ఏభై ఏళ్ల స్త్రీ కావలెను. ఆమెకు ఎటువంటి బాధ్యతలూ వుండరాదు.."
"శ్యామలా ఎలావుంది" అనడిగాడు.
"ఇదేమిటండీ.... ఎందుకీ ప్రకటన?" ఆశ్చర్యంగా అడిగింది.
"'తాతయ్యకోసం...' దీన్ని రేపు ఉదయం పేపరుకి పంపిస్తాను. ఇది చదివి ఎవరైనా వస్తారుకదా....."
"చాల్లే వూరుకోండి.... ఎవరైనా వింటే నవ్వుతారు."
"ఎందుకు నవ్వుతారు! పైగా చాలా మెచ్చుకుంటారు. ఈ కాలంలో వేరుకాపురాలొచ్చాయి. దాంతో తల్లి దండ్రులు అందరికీ భారమవుతున్నారు. నిరాదరణకు గురవుతున్నారు. కాబట్టి ఈ ప్రకటన వెలఉవడగానే కుప్పలు కుప్పలుగా వుత్తరాలొస్తాయిచూడు......"

"సరేగానీ. ముందు మీ తాతయ్యగారి పర్మిషన్ తీసుకోండి... ఇది ఆయనకు సంబంధించిన విషయం కదా..."
"అలానే...." కాగితం మడిచిపెట్టి.. లైటార్పేశాడు.

* * *

మర్నాడు రవీంద్ర... తాతగారికీ విషయం చెప్పాడు.
"ఎలావుంది తాతయ్యా. నా ఐడియా" అనడిగాడు.
"నీకేమన్నా మతిపోయిందా.......?"
"వుహు... మతి వుంది కాబట్టే ఈ ప్రకటన ఇవ్వాలనుకుంటున్నాను.. తాతయ్యా! నువ్విలా ఒంటరిగా దిగులుగా వుంటోంటే నేను చూడలేకుండా వున్నాను..."

"నాకు ఒంటరితనమేమిట్రా.. మీరిద్దరూ లేరా!..."

"అబ్బ తాతయ్యా! అవన్నీ వదిలిపెట్టెయ్. నేను ఎంతో ఆలోచించి ఈ నిర్ణయానికి వొచ్చాను.. ఇక దీనికి తిరుగులేదు. నలుగురూ ఏమనుకుంటారో నన్న భయంలేదు. కొత్తకాబట్టి మొదట్లో వింతగా వుండొచ్చు అలవాటైతే అందరూ మనదారినే అనుసరిస్తారు. దీనికి నువ్వు అడ్డుచెప్పడానికీ వీల్లేదు. శ్యామల కూడా ఒప్పుకుంది..."

"ఏమిటోరా... నాకు మాత్రం ఏంబాగాలేదు..."గొణిగాడు.
కానీ రవీంద్ర లెక్కచెయ్యలేదు.
ఆరోజు త్వరగా బయల్దేరాడు.
ముందు పత్రికాఫీసుకెళ్లి ప్రకటన ఇచ్చి ఆతర్వాత ఆఫీసుకెళ్లాడు.

* * *

"నాకో చిన్న అనుమానమండీ" అంది శ్యామల.. ఆరాత్రి భోజనం చేస్తుండగా.
రవీంద్ర నవ్వుతూ "అడుగు" అన్నాడు.
"మీరు తాతగారి గురించి ప్రకటన ఇచ్చారు బాగానే వుంది. కానీ దానిలో 'పురుషుడు కావలెను' అని ఎందుకు రాయలేదు.?"
రవీంద్ర పకపకా నవ్వాడు.

"చాలా పెద్ద సందేహమేనే. చూడు శ్యామలా వయసు పెరుగుతోన్నకొద్దీ మగవాళ్లల్లో చిరాకు, స్త్రీలలో సహనం అధికమవుతాయట. తాతయ్యకు ఆ వయసులో స్త్రీ తోడు చాలా అవసరం.."

"కానీ ఈ దేశంలో ఆడవాళ్లకు సెంటిమెంట్లు చాలా ఎక్కువ. భర్తపోయిన స్త్రీ పరాయి మగాడి నీడ కూడా తనపై పడటం సహించలేదు. ఆ వయసులో తనవాళ్ల దగ్గర వుండాలనే ఎక్కువ కోరుకుంటారు. అటువంటిది.. ఏమాత్రం పరిచయంలేని మన మధ్య.. ముఖ్యంగా తాతగారికి తోడుగా ఎలా వుండగలదు." అంది శ్యామల.

రవీంద్ర ఏదో ఆలోచిస్తున్నట్లు తలపంకిస్తూ.
"నువ్వన్నది నిజమేననుకో కానీ శ్యామలా! తన వాళ్లే తనకు కానివాళ్లయితే- ఎటూదారిలేకపోతే ఒప్పుకోవచ్చుకదా. ఒక్కొక్కసారి నమ్మలేని విషయాలె జరుగుతుంటాయి. చూస్తూడు మన ప్రకటనకి తప్పకుండా జవాబు వస్తుంది..." అన్నాడు.

[ 80 వ పేజీ చూడండి]

# సంధ్యా సమయంలో...

[ 29 వ పేజీ నుంచి]

శ్యామల ఇంకేం మాట్లాడలేదు.

శ్యామల ముందు ఓడిపోకూడదని బింకంగా మాట్లా డేడు కానీ రవీంద్రకు కూడా మనసులో బెరుగ్గానే వుంది. అసలు ఈ ప్రకటన ఎవరైనా చూస్తారా. చూసినా దానికి ఎవరైనా జవాబు రాస్తారా. విదేశాల్లో ఇటువంటివి జరగొచ్చు కానీ సంప్రదాయాలకు ఆచారా లకు ప్రాధాన్యత నిచ్చే ఈ దేశపు స్త్రీలు.. వీళ్లు... తనకు జవాబు రాస్తారా? ఆ వచ్చే స్త్రీ ఎలా వుంటుంది? తాతయ్య ఒంటరితనం తొలగిపో తుందా?... ప్రతిక్షణం... ఆలోచిస్తూ... పోస్టుకోసం ఆత్రంగా ఎదురు చూడసాగాడు.

రోజూ సాయంత్రం ఇంటికి రాగానే.. శ్యామలని వుత్తరాలకోసం అడిగేవాడు. తనకంటె ముందు వస్తుంది కాబట్టి వుత్తరాలు వచ్చినా తనని ఏడిపించ డానికి దాచేస్తుందేమో అనే అనుమానం కూడా వచ్చింది.

ప్రతిరోజూ.. 'ఏమీలేవు' అని చెప్పే శ్యామలని సందేహంగా చూసేవాడు.

'మీరు ఓడిపోయినట్లే' అని వెక్కిరించేది.

'నిజంగా ఏమీ రాలేదా?' వారం తర్వాత అనుమా నంగా అడిగాడు.

'అయితే నేను దాస్తున్నానని మీ కనుమానమా అంత అవసరం నాకేం లేదు... నామీద నమ్మకం లేకపోతే రోజూ నాకంటే మీరే ముందురండి....'' కోపంగా అంది.

ఇక అ మర్నాటినుండీ రవీంద్ర వుత్తరాల కోసం అడగడం మానేశాడు.. కానీ మనసులో ఆరాటం మాత్రం ఎక్కువైపోతోంది.

ప్రకటన వేసిన వారమైనా ఒక్కళ్ళూ ఎందుకు జవాబు వ్రాయలేదు. ఇక ఎవరూ రాయరేమో? తాతయ్య అలా ఒంటరితనంతో బాధపడాల్సిందేనా. లేకపోతే శ్యామల్ని వుద్యోగం మాన్పించాలా? ఒక్క జీతంతో ఈ పెరుగుతున్న ధరల మధ్య ఎలా బ్రతకాలి?

రవీంద్రకంతా అయోమయంగా వుంది.

అతడిటువంటి స్థితిలో వుండగా ఒకనాటి సాయంత్రం.. రవీంద్ర ఇంటికి రాగానే.

'మీకు మూడు వుత్తరాలొచ్చాయండీ'' అంది

''అలాగా..' ఆశ్చర్యానందాలతో వుక్కిరిబిక్కిరయ్యాడు.

'ఏవీ' ఆత్రంగా అందుకుని... చదవసాగాడు.

అందులో ఒక వుత్తరం పూర్తి వ్యాపారసరళిలో వుంది. ''జీతం ఎంత ఇస్తారు? ఏవేం పనులు చెయ్యాలి? రోజుకు ఎన్ని గంటలు'' ఇలా సాగింది.

రవీంద్ర దాన్ని ప్రక్కనే పడేశాడు.

రెండోది ఒక కొడుకు వ్రాశాడు.

''నాతల్లిని చూసేవాళ్లెవరూ లేరు మీరెప్పుడు రమ్మంటే అప్పుడొచ్చి ఆవిడ్ని దిగబెడతాను.

దాన్ని చదవగానే రవీంద్రకు వెర్రి కోపం వచ్చింది. కన్న తల్లిని చూడని ఇటువంటి వెధవల్ని మాట్ చెయ్యాలి' అనుకుంటూ మూడో ఉత్తరం విప్పాడు.

అది ఒక యాభైఏళ్ల స్త్రీ వ్రాసింది. ఆవిడకు ముగ్గురు కొడుకులు ఇద్దరు కూతుళ్లు పిల్లలందరూ వృద్ధిలోకి వచ్చారు. భర్త అయిదేళ్ల క్రితం చనిపోయాడు. ఇప్పుడావిడ అవసరం ఎవరికీ లేకపోవడంతో ఆవిడ అందరికీ భారమైంది. చివరికామె కొడుకులందరూ కలిసి తమవూళ్లోవున్నాయింట్లో వుంచి నెలకింతని పంపుతున్నారు. ఆవిడ తనస్థితిని వివరిస్తూ ''బాబూ నాకు కావలసింది తిండి కాదు. ఆదరణతో కూడిన ఒకమంచిమాట. ఒక ప్రేమపూరితమైన స్పర్శ అదిలేక.. ఈ మనోవ్యధతో నేను కృంగి కృశించిపోతున్నాను.... అనుకోకుండా నీ ప్రకటన చూశాను. జీవితాంతం ఇతరులకోసమే బ్రతికాను. ఈ చివరి దశలో కూడా మరొకరికి సాయపడటం కంటే పరమార్థం ఏముంది.... నాకు చేతనైన సేవ చేస్తాను... 'అదీ.. మీకిష్టమై తేనే....''

ఆమె వుత్తరం చదవగానే రవీంద్ర హృదయం ద్రవించిపోయింది. మనుమలెంత స్వార్థపరులుగా తయారవుతున్నారు. వళ్లు తిని చెట్టుని కొట్టేసే ఈ రకం మనుమల్ని ఏంచేయాలి.

వెంటనే ఊరు వెళ్లి ఆమెని తీసుకురావడానికి నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయం శ్యామలకు కూడా చెప్పాడు.

## ధరలు మండిపోతూంటే ఖరీదైన అవార్డులా?

మహారాష్ట్ర గౌరవ పురస్కార్ అవార్డులు ఈ మధ్య సాహిత్యం, క్రీడారంగం, నాటక రంగం, నాట్యం, సేవా, రక్షణ శాఖ - యిలా వివిధ రంగాలలో నిష్ణాతులైన 310 మందికి యిచ్చి నట్లుగా ప్రకటించారు. ఈ అవార్డు పొందిన వారిలో సునీల్ గవాస్కర్, లతా మంగే ష్కర్, నిస్సిమ్ ఇజికిల్ వంటి ప్రముఖులు వున్నారు. అవార్డు క్రింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల. నగదు లభిస్తుంది. అంటే మూడుకోట్ల పది లక్షల రూపాయలు అన్నమాట. 'అసలే ధరలు నింగినంటుతున్న రోజుల్లో యింత డబ్బు ప్రభుత్వం, అవార్డుల పేరిట దుర్వినియోగం చేస్తుందా...ఈ పరిస్థితుల్లో యిది న్యాయమేనా... ఇలాంటి అవార్డు నాకు వద్దు 'అంటూ, ఆ అవార్డును తిరస్కరించింది ప్రసిద్ధ సాహితీ వేత్త దుర్గా భగవత్. తమ గౌరవార్థం ఇచ్చిన అవార్డుని అలా ఆవేశంతో తిరస్కరించిక లతామంగేష్కర్‌లా ఏ ప్రజోపయోగ కార్యానికైనా వినియోగిస్తే బాగుండేది అన్నవారూ లేకపోలేదు. అసలింతకీ దుర్గా భగవత్ చెప్పినట్లు ప్రముఖుల్ని సత్కరించ డానికి ప్రజల సొమ్ము అలా వినియోగించాలా?

---

''అలాగే...'' అంది...

''రాను రాను ఈ మనుమల్లో ఆప్యాయతలు అనుబంధాలు ఎందుకు తగ్గిపోతున్నాయా అన్పి స్తోంది. ఒకప్పుడు సమిష్ఠికుటుంబాలుండేవి..అందరూ కలిసిమెలిసి వుండేవారు. ఇప్పుడు పట్టణాలు పెరి గాయి..వుద్యోగాలొచ్చాయి..వేరుకాపురాలొచ్చాయి... కుటుంబంతోపాటు మనస్సు కూడా సంకుచితమై పోతోంది. ఈ పరిణామం చాలా బాధని కల్గిస్తోంది...'' అన్నాడు రవీంద్ర..

'అవునండీ పిల్లల్ని కన్నందుకు బాధ్యతగా వాళ్లని పెంచాలేకాని ముసలి వయసులో మనకేదో ఆధార మవుతారనే ఆశ పెట్టుకోకూడదు..లేకపోతే వీళ్లలా మనమూ ఎన్నో సమస్యల్నెదుర్కోవాలి..' అంది శ్యామల.

రవీంద్ర నవ్వేస్తూ..''మన సమస్య సర్లేవోయ్, ముందు తాతయ్య సమస్య తీరనీ....'' అంటూ స్నానం చెయ్యడానికి లేచాడు.

''శ్యామలా! శ్యామలా!''

రెండ్రోజుల తర్వాత రవీంద్ర ఆఫీసునుండి..కంగారుగా వచ్చాడు.

శ్యామల కూడా అప్పుడే ఆఫీసునుండి వచ్చింది.

స్టవ్ వెలిగించి పాలు కాస్తోంది. రవీంద్ర కేకలకు అదిరిపోయి స్టవ్ ఆర్పి పరుగెట్టుకు వచ్చింది.

''ఏం జరిగిందండీ''

''చాలా ఘోరం జరిగిపోయింది శ్యామలా''

సోఫాలో కూర్చుని రెండు చేతుల్తో తల పట్టుకున్నాడు.

''ఏంజరిగిందండీ'' ఆత్రంగా అడిగింది.

''రామకృష్ణ తల్లి చనిపోయింది...''

''అరె...అలాగా... ఎలా చనిపోయారు?''

''మేము ఆమెని బలవంతంగా అక్కడ వదిలేసి వచ్చాంగదా: రామకృష్ణ ఆమెతో అబద్ధం చెప్పినా... ఆమెకి తర్వాత అతడు చేసినవని అర్థమైంది: ఆ బాధని భరించలేకపోయింది: ఇంటికి వెళ్లిపోతానని గొడవచేసిందట: కానీ వాళ్లు ఒప్పుకోలేదు: ఇక్కడే వుండాలని ఖచ్చితంగా చెప్పారట: ఆవిడ దానికి తట్టుకోలేక ఆ రాత్రి...ఆవరణలో వున్న నూతిలోపడి మరణించారు...'' రవీంద్ర కంఠం దుఃఖంతో పూడుకు పోయింది. క్షణం ఆగి అన్నాడు.

''శ్యామలా ఆమె ఎంత భయంకరంగా చనిపోయిందో తెలుసా: ఆ బావిలో నీళ్లు లేవు: ఆవిడ పడగానే - తల వెళ్లి అడుగున వున్న రాతికి కొట్టుకుంది: ఉదయం ఎవరో చూసి బయటికి తీశారు: ఆ తర్వాత ఒక రోజల్లా ఆస్పత్రిలో నరకయాతన అనుభవించి...''

అతని కళ్లవెంట జలజలా నీళ్లు రాలాయి: శ్యామల కళ్లు కూడా చెమ్మగిల్లాయి! శ్యామల, దగ్గరికొచ్చి అతని కన్నీటిని తుడిచింది! రవీంద్ర శ్యామల చేతిని అదిమి పట్టుకున్నాడు!

''శ్యామలా! రామకృష్ణ తల్లిని చంపిన హంతకుడు.. వాడు రేపు కనబడనీ...'' పళ్లు కొరుకుతూ ఆవేశపడి పోయాడు..

''వూరుకోండి''

''వాడు కూడా పిచ్చివాడులా తయారయ్యాడుట...కానీ ఇప్పుడేడ్చి ప్రయోజనం ఏవుంది? ఆనాడు ఆవిడ వద్దని బ్రతిమాలుకున్నా వినకుండా అక్కడ వదిలి వచ్చాడు. ఆవిడ చావుకు కారణమయ్యాడు.. వెధవ..వాడిక్కూడా చివరకు అలాటి చావే రావాలి..''

''అలా అరవకండి...తాతగారు వింటారు'' అంది శ్యామల ఆ మాట వినగానే రవీంద్ర చప్పున తగ్గి పోయాడు.

''శ్యామలా! తల బ్రద్దలైపోతోంది! కాఫీ తెచ్చిపెట్టు..''

శ్యామల లోపలకు వెళ్లింది.

శ్యామల తెచ్చిన కాఫీ త్రాగుతూ ''ఒంటరితనపు దిగులుతో తాతగారు కూడా ఏ విధమైన అఘాయిత్యం చేయకుండా...వెంటనే వెళ్లి ఆమెను తీసుకురావాలి..'' అనుకున్నాడు రవీంద్ర.

రాధమ్మ ఆ ఇంట్లో అడుగుపెట్టాక ఆ ఇంటికి కొత్త కళ..జీవం..వచ్చినట్లయింది.

ఆమెకు దాదాపు యాభైఅయిదేళ్లుంటాయి. తెల్లని బట్టల్లో - ఎప్పుడూ శుభ్రంగా వుంటుంది. సంస్కారంతో కూడిన ప్రవర్తన ముఖంపై మాయని చిరునవ్వుతో అందరినీ ఆకట్టుకుంటుంది. ఆమె కొద్దిగా చదువు కుంది కూడా...తనకున్న జ్ఞానంతో తెలుగు సాహిత్యం లోని మహాకవులను కూడా చదివి అర్థం చేసుకుంది. 'ఆమెలాటి తల్లిని వదులుకున్న ఆ కొడుకులు ఎంతో

దురదృష్టవంతులు' అనుకున్నాడు రవీంద్ర ఆమెని చూశాక!

"ఏవండీ! ఆమె నాకెంతో నచ్చిందండీ..." శ్యామల ఎన్నోసార్లు అంది భర్తతో-

"నీకు నచ్చడం కాదోయ్! తాతయ్య ఒంటరితనం పోవాలి - దానికోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు.

రాధమ్మ వచ్చిన తర్వాత శ్యామలకు పని తగ్గి పోయింది! సాయంత్రం శ్యామల ఆఫీసునుండి వచ్చే టప్పటికి టిఫిను - కాఫీతో పాటు వంట కూడా చేసి సిద్ధంగా వుంచుతోంది!

శ్యామల ఆనందం చెప్పనలవి కాదు. "అబ్బ! ఈవిడొచ్చాక కాస్త వూపిరి పీల్చుకోగలుగుతున్నాను!" శ్యామల సంబరపడిపోతోంది.

ఆ సంబరాన్ని పట్టించుకోలేదు రవీంద్ర! తనకు కావల్సింది శ్యామల సంతోషం కాదు! తను శ్యామల కోసం ఈవిడ్ని పిలిపించలేదు! తాతయ్యనురప్పించాడు. ఆవిడా - తాతయ్యా కలిసి నవ్వుకుంటూ భోజనం చెయ్యాలి! ఇద్దరూ కలిసి ప్రొద్దున్నా - సాయంత్రం వాకింగ్‌కి వెళ్లాలి! సాయంత్రం వేళల్లో వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకోవాలి! రాత్రిళ్లు కలిసి టి.వి చూడాలి!

ఇవీ తన కోరికలు....

ఆవిడొచ్చి పదిహేనురోజులు గడుస్తున్నా - తాతయ్యా ఆవిడా కలిసి ఇంతవరకూ ఒక్కమాట కూడా మాట్లాడు కోలేదు. మొదటిరోజు వారిద్దరినీ పరిచయం చేసి నప్పుడు తప్ప ఇద్దరూ ఒకరినొకరు చూసుకోలేదేమో కూడా..

ఆ విషయాలన్నీ శ్యామలతో అన్నాడు!

"మీదంతా విడ్డూరమండీ! అంత త్వరగా సాన్ని హిత్యం ఏర్పడ్డానికి వాళ్లేమన్నా వయసులో వున్నారా! వాళ్లిద్దరి మధ్యా స్నేహం కలగాలంటే కొద్ది టైము పడుతుంది. మీరు ఓపికపట్టాలి!" అంది.

రవీంద్ర ఆ మాటల్తో అప్పటికి సమాధానపడ్డాడు! కానీ రోజులు గడుస్తున్నా అతని కోరిక నెరవేరే సూచన మాత్రం కనబడలేదు. ఆవిడ వుదయమే లేచి వంట - టిఫిను పని పూర్తిచేసుకుని ఆ తర్వాత తన గదిలోకెళ్లి - ఏదో పుస్తకం చదువుకుంటుంది! ఇక తాతయ్య ఎప్పటిలా తన గదిలోనే వుండిపో తున్నాడు!

వాళ్లిద్దరి మధ్యా సాన్నిహిత్యం ఏర్పడ్డానికి తనేం చేయాలో కూడా అతనికి బోధపడలేదు.

ఒకవేళ తను అనుకున్నది జరక్కపోతే ఆమెనేం చెయ్యాలి! వెళ్లిపొమ్మంటే ఏంబాగుంటుంది? ఆలోచనల్తో సతమతమైపోసాగాడు రవీంద్ర!

రోజులు గడుస్తున్నాయి!

అతని బాధ ఎక్కువైపోతోంది.

"నేను చెప్పానా! మనదేశంలో ఇటువంటివి అసాధ్యమని - నా మాట విన్నారా? ఇకమీరు ఓడి పోయినట్లే..." శ్యామల వెక్కిరించసాగింది.

తన ఓటమికంటే తాతయ్య బాధ తీరలేదని రవీంద్రకు చాలా విచారంగా వుంది!

ఇదివరకు తాతయ్య సమస్య ఒక్కటే...ఇప్పుడు ఆమె కూడా చేరింది.. "ఆమెను తీసుకొచ్చి పొరపాటు చేశానా" అనుకోసాగాడు.

మరో నెలరోజులు గడిచాయి.

కానీ పరిస్థితిలో ఎటువంటి మార్పులేదు.

శ్యామల కిప్పుడు వంటపని పూర్తిగా తప్పింది. రాధమ్మ చేతివంట రుచితో ఇద్దరూ కొద్దిగా లావయ్యారు కూడా! కానీ రంగనాథరావు ఒంటరితనం ఇంకా ఎక్కు వైంది. రాధమ్మ వుండటం వలన మొహమాటంతో ఆయన అసలు గది వదిలి బయటకు రావడం లేదు. రవీంద్ర ఇక భరించలేకపోయాడు.

"శ్యామలా! ఇంకోవారం చూసి ఆమెని పంపెయ్యా లనుకుంటున్నాను" అన్నాడొక రోజు శ్యామలతో.

శ్యామలకేం చెప్పాలో తోచలేదు. భర్త బాధని గమని స్తూనే వుంది. ఆమెకీ పరిస్థితి అయోమయాన్ని కలిగి స్తోంది..భర్త ఎంతో సదభిప్రాయంతో ఆమెని తీసు కొచ్చాడు. పైకి భర్తని వెక్కిరిస్తోన్నా - మనసులో మాత్రం భర్త కోరిక నెరవేరాలనే కోరుకుంటోంది. కానీ అతని కోరిక నెరవేరే సూచనలేమీ కనబడటం లేదు.

## ఓ మాతృమూర్తి 'ఆర్తనాదం'!

ఉదయమే లేవమ్మా అంటే
ఉండమ్మా కడుపునొప్పి నాకంటుంది.
పాటలు వినకమ్మా. అంతగానంటే
లెక్కలు ఎక్కవమ్మా లేకుంటే అంటుంది
డైజెస్టులు చదవకమ్మా అస్తమానం అంటే
ఇంటరెస్టు నాకందులోని విషయాలమ్మా
అంటుంది.
వంటయింటి పని అందుకోవమ్మా అంటే
వంట పుట్టిని పెట్టరాదమ్మా అంటుంది.
ఇంటిని చక్కగా తీర్చిదిద్దమ్మా అంటే
ఇంటీరియర్ డెకొరేషన్ నేర్చుకున్నాకమ్మా
అంటుంది.
పౌష్టికాహారం వంట పట్టించుకోవమ్మా అంటే
వండిపెట్టినా నువు నోటపెట్ట తీరికేదమ్మా
అంటుంది.
పరుషంగ మాటాడరాదమ్మా అంటే
సరస సంభాషణలకు నాకు చుక్కెదురంటుంది.
బద్ధకం వదిలించుకోవమ్మా అంటే
అది జన్యుజనితంగాదా, నన్నెంచనేలమ్మా
అంటుంది.
ఈ తల్లి మనసు నిలావేధించ కమ్మా అంటే
నీపిల్లకావిద్యలో అ, ఆ, లేకదమ్మా
వచ్చునంటుంది.
జడవేసుకోవడం నేర్వరాదా అంటే
ఇంతవంకరగ అల్లినదేమని నిన్నందురేమోనమ్మా
అంటుంది
తోటి మాతృమూర్తులారా మీకూ ఉన్నారాయిటు
వంటి మొండి, శిఖండీ, అవరదేవయానులు?
ఉంటే ఎట్లా వేగుతున్నారమ్మా వారితో?
కిటుకేదైనా ఉంటే చెప్పరమ్మా నాకొకింత!

-నిమ్మగడ్డ ఎస్.లక్ష్మి

రాధమ్మ వెళ్లిపోతుందంటే ఆమెకు చాలా బాధగా వుంది. రాధమ్మ ఆ పల్లెటూళ్లో ఒంటరిగా వుండలేకే ఇక్కడకొచ్చింది. ఇక్కడకు వచ్చాక ఆమెలో వుత్సాహం - ఆనందం కనబడుతున్నాయి. ఆమెని మళ్లీ అపల్లె టూరికే వెళ్లిపొమ్మనడం సమంజసంగా వుంటుందా?

శ్యామల ఇలా మధనపడుతున్న సమయంలో ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.

ఒకరోజు వుదయం - రవీంద్ర లేచి మామూలుగా తాతగారి గదిలోకి అడుగుపెట్టాడు. కానీ రోజులా దుప్పటి కప్పుకుని కూర్చునే తాతగారు కనబడలేదు. వంటింట్లోకి వచ్చి "శ్యామలా! తాతగారేరీ!" అనడిగాడు"

"ఏమోనండీ" అంది.

రవీంద్ర ఇల్లంతా వెదికాడు.

రాధమ్మనడిగాడు.

"నాకు తెలీదు బాబూ" అంది.

రవీంద్రకు కంగారెక్కువైంది.

ఎప్పుడూ ఒంటరిగా కూర్చోడం తప్ప ఇల్లు వదలి వెళ్లని ఆ వ్యక్తి ఏమయ్యాడు?

"ఏమండోయ్! ఇలా రండి" శ్యామల పిలవడంతో పరుగున ఆయన గదిలోకి వెళ్లాడు.

శ్యామల చేతిలో ఏవో కాగితాలు కనబడ్డాయి.

"తాతగారు రాశారండీ!" అంది.

"ఏదీ! ఇటువ్వు!"

తీసుకుని చదవసాగాడు రవీంద్ర...

నాయనా రవీ,

నీకు చెప్పకుండా ఇలా వెడుతున్నందుకు బాధగా వుంది! కానీ చెప్తే నువ్వు వెళ్లనివ్వవు కదా... అసలీపని ఎప్పుడో చేయాల్సింది. వారం క్రితం రాధమ్మ నా దగ్గరికొచ్చి - నా కళ్లు తెరిపించేవరకూ అజ్ఞానంలో - అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాను. అరవైఏళ్లొస్తే చావు వచ్చేసిందని - మృత్యుభయంతో పీడకలలతో ప్రతిక్షణం చస్తూ ఇన్నాళ్లూ బ్రతికాను! వార్ధక్యాన్ని కూడా సార్థకం చేసుకోవచ్చని రాధమ్మ తెలియచెప్పింది. నాకు ఆరోగ్యం వుంది. డబ్బు వుంది. నేను తలుచుకుంటే ఏ కార్యాన్నయినా చేయొచ్చు! ఇన్నా ళ్లూ జీవితాన్ని వ్యర్థంగా గడిపాను! ఇక నలుగు రికీ వుపయోగపడే ఘనకార్యం ఏదైనా సాధించాలి. దానికి ముందుగా దేశమంతా పర్యటించి - భారత దేశంలోని వింతలూ, విశేషాల్తో పాటు పుణ్యక్షేత్రాల్ని దర్శించాలని వుంది. ఆ పర్యటనలో నేను చేయబోయే కార్యక్రమాన్ని రూపొందించుకుంటాను. ప్రస్తుతం దేశ పర్యటనకు బయలుదేరాను. నీకు తరచూ వుత్తరాలు రాస్తాను. నా గురించి కంగారుపడకు. ఏ మనిషికైనా వృద్ధాప్యం శాపం కాదు. ప్రతి అడుగులోనూ అందం వున్నట్లే - ప్రతి వయసులోనూ హుందాతనం వుంది. రిటైరవగానే జీవితం పూర్తయినట్లు భావించడం శుద్ధ తెలివితక్కువ. కనక తగిన వ్యాపకాన్ని ఏర్పరచుకుని ప్రతిక్షణం వుల్లాసంగా జీవించాలి. అతివిలువైన మానవజన్మని సార్థకం చేసుకోవాలి. రాధమ్మ నాకు చేసిన హితోపదేశం ఇది...ఆమెను తెచ్చి ఒకవిధంగా నాకెంతో వుపకారం చేశావ్. రవీ! ఒక్క కోరిక...ఏదైనా ఒక పని చెయ్యడంలో మగవానికున్న అవకాశాలు ఆడవాళ్లకు లేవు. అందుకే ఆమెకెన్నో ఆశయాలున్నా పరిస్థితులు కలిసిరాక నెరవేర్చుకోలేకపోయింది. కొడుకులు మూర్ఖులు కాబట్టి అటువంటి రత్నాన్ని వదులుకున్నారు. నువ్వామెను ఆదరించాలి. నన్ను చూసినట్లుగానే ప్రేమతో చూడాలి...నాకామె చేసిన వుపకారానికి ప్రతిగా ఇది నువ్వు చెయ్యాలి. ఇక వుంటాను. శ్యామలకు ఆశీస్సులు. మళ్లీ త్వరలోనే వుత్తరం రాస్తాను.

నీ తాతయ్య

ఆ వుత్తరం చదవగానే రవీంద్ర మనస్సు ఎంతో తేలిక పడింది. "తాతయ్యా! ఇక నీ గురించి దిగుల్లేదు" అనుకున్నాడు.

తను కోరుకున్నట్లుగానే తాతయ్య ఒంటరితనం పోగొట్టి - ఆయన జీవనగతినే మార్చిన రాధమ్మపై అభిమానం వెల్లువై పొంగిపొరలింది.

"శ్యామలా! చూశావా, నేనే గెలిచాను" అన్నాడు రవీంద్ర శ్యామల చేతులు పట్టుకుని...

"అంతా సవ్యంగా జరుగుతుందని నేనూ చెప్పాగా.." చిన్నగా నవ్వుతూ అంది.

"ఇదంతా రాధమ్మ గొప్పతనం. ఆమెకు మనం ఎంతో ఋణపడివున్నాం" అన్నాడు రవీంద్ర కృతజ్ఞతా భావంతో! ❑